

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 కనిష్ఠం 23.8

రేపు ఉప్పల్‌లో క్రికెట్ మ్యాచ్.. ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియంలో ఈనెల 12న ఇండియా-బంగ్లాదేశ్‌ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ సందర్భంగా స్టేడియం పరిసరాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 11.50 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. చెంగిచర్ల వైపు నుంచి ఉప్పల్ వైపు, ఎల్బీనగర్, నాగోల్ మెట్రోస్టేషన్, తార్నాక, నాచారం, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో వాహనాల మళ్లింపులు ఉంటాయని పేర్కొన్నారు.

నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కురిసిన మోస్తరు వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జాం సమస్యలు తలెత్తాయి. సాయంత్రం బతుకమ్మ ఆడేందుకు వచ్చిన మహిళలు వర్షానికి ఇబ్బందులు పడ్డారు. రాజేంద్రనగర్‌లో 9.3, బండ్లగూడలో 8.8, చార్మినార్‌లో 8.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు ఇదే తరహా వాతావరణం కొనసాగుతుందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.





ట్యాంక్‌బండ్‌పై జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న విమలక్క, చిత్రంలో మంత్రి సీతక్క, మేయర్ విజయలక్ష్మి తదితరులు



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనం

సద్దుల సంబురం

● ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన వేడుకలు

కవాడిగూడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. లేజర్ షో, బాణసంచా వెలుగుల్లో మహిళలు బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. లంబాడీ, గిరిజన, దింసా నృత్యాలు అలరించాయి., ఒగ్గుడోలు కళాకారులు ఆకట్టుకున్నారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, ప్రజాగాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, తెలంగాణ నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మహిళలకు తోడుగా నిలబడి ఆడపిల్లలను ఎదగనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిదేవి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.





బతుకమ్మతో మంత్రి సీతక్క



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



మన్సూరాబాద్ చెరువు వద్ద బతుకమ్మ వేడుకల సందడి





జ్యోతిప్రజ్వలన చేస్తున్న మీనాక్షి చౌదరి, బాలకృష్ణ, నిర్వాహకులు మణిదీప్, స్పందన

సంప్రదాయ వస్త్రాలకు ఆదరణ

● వారాహి సిల్క్స్ ప్రారంభోత్సవంలో బాలకృష్ణ

బంజారాహిల్స్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సంప్రదాయ వస్త్రాలకు ఆదరణ పెరుగుతోందని, ప్రస్తుతం అన్ని రకాల వస్త్రాలూ ఒకే దగ్గర దొరికేలా షోరూంలు ఏర్పాటు కావడం శుభపరిణామమని సినీనటుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. గుంటూరుకు చెందిన కన్యకాపరమేశ్వరి సిల్క్ స్టోర్ 55 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లో ఏర్పాటు చేసిన వారాహి సిల్క్స్‌ను బాలకృష్ణ, సినీనటి మీనాక్షి చౌదరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ అమ్మవారి పేరు పెట్టడమే కాకుండా, షాపింగ్ ప్రియులకు కావాల్సిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచారన్నారు. వారాహి సిల్క్స్ చైర్మన్లు ఏచూరి స్పందన, ఏచూరి మణిదీప్ మాట్లాడుతూ కంజీవరం పట్టు, బనారస్ బందిని, ఉప్పాడ పట్టు వంటి వస్త్రాలను స్టోర్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతీ 25,000 కొనుగోలుపై అరగ్రాము గోల్డ్ కాయిన్, 50వేల కొనుగోలుపై గ్రాము గోల్డ్ కాయిన్, లక్ష కొనుగోలుపై 2 గ్రాముల గోల్డ్ కాయిన్ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వారాహి స్టోర్ మేనేజర్లు, సూపర్ వైజర్‌లు, సేల్స్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ



సీపీఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ ఆయుధ పూజ నిర్వహించారు



కిడ్నాపైన చిన్నారుల ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగింత ● పోలీసుల అదుపులో నిందితులు

తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రమైన ఒడిశాలో కిడ్నాపైన చిన్నారుల ఆచూకీ నగరంలో లభ్యమైంది. టెక్నికల్ ఆధారాలతో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.

సంగారెడ్డి అర్బన్, హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో మనూర్ మండలం దూదికొండ గ్రామానికి చెందిన నసీమా(25)కు జన్మించిన ఆడబిడ్డను బుధవారం నలుగురు మహిళలు కిడ్నాప్ చేశారు. ఇద్దరు స్కూటీపై ఇద్దరు ఆటోలో వచ్చి కిడ్నాప్ చేసినట్టు సీసీటీవీ ఫుటేజ్‌లో పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ రూపేష్ పది పోలీసు బృందాలు ఏర్పాటు చేసి స్కూటీ నంబర్ ఆధారంగా గాలించగా హైదరాబాద్‌లోని బోరబండలో ఉన్నట్టు గుర్తించారు. దీంతో స్కూటీతో పాటు కిడ్నాప్ చేసిన ఓ మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి పసికందును స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు మహిళ కిడ్నాపర్ల కోసం గాలిస్తున్నారు.

ఒడిశా బాలుడు నగరంలో లభ్యం..

ఒడిశా నౌపాడా ప్రాంతానికి చెందిన దుర్యోధన్ బరిహా (30), పద్మిని మాజీ అలియాస్ పద్మిని బిమల్ (35)లు కలిసి అదే ప్రాంతానికి చెందిన బాలుడిని కిడ్నాప్ చేశారు. నగరానికి తరలించి రాచకొండ కమిషనరేట్ పరిధిలోని తూముకుంట గ్రామంలో ఇటుక బట్టీల్లో వీరు పనికి చేరారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు సాంకేతిక ఆధారాలతో బాలుడు తూముకుంటలో ఉన్నట్లు నౌపాడా పోలీసులు గుర్తించారు. రాచకొండ పోలీసులను వారు సంప్రదించగా 24 గంటల వ్యవధిలో నిందితులను గుర్తించి ఒడిషా పోలీసులకు అప్పగించారు. సీపీ సుధీర్‌బాబు బాలుడిని తల్లికి అప్పగించారు.


దారుల్ షిఫా నుంచి బస్టాండ్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

చార్మినార్ అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ అన్నారు. గురువారం ట్రాఫిక్ సిబ్బందితో కలిసి సాలార్జంగ్ మ్యూజియం నుంచి ఎంజీబీఎస్ వరకు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో సమస్యలు పరిష్కారం కావు

మదీన, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లు-2024తో సమస్యలు పరిష్కారం కావని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు, వక్ఫ్ ట్రిబ్యునల్ అధికారులపై ఆంక్షలు విధించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొస్తుందని విమర్శించారు. బిల్లు ముసాయిదాను రూపొందించే సమయంలో ముస్లిం మేధావులను సంప్రదించలేదన్నారు. ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలనుకుంటే ముస్లిం సంఘాలను, మేధావులను సంప్రదించేదని అన్నారు.

పార్కులో అంధకారం

- **బతుకమ్మ పండుగ రోజూ లైట్లు ఏర్పాటు చేయని అధికారులు**

మదీన, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో బతుకమ్మ పండుగకు ఆదరణ కరువైందని బీఆర్ఎస్ కిషన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయి కిరణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ పండుగకు దేశ విదేశాలలో గుర్తింపు తీసుకొచ్చారని, ప్రతీయేటా వేడుకల సందర్భంగా అధికారులు కిషన్‌బాగ్ పార్కులో లైటింగ్ ఏర్పాటు చేసేవారని, మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడేవారన్నారు. పార్కులో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో అంధకారంగా ఉందన్నారు.



మామిడి పల్లి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ పెద్దమ్మ దేవాలయంలో పూజలో పాల్గొన్న బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ గౌడ్ తదితరులు

పండుగల ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేయాలి

పహాడిషరీఫ్ అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పండుగలను కుటుంబ సమేతంగా జరుపుకోవాలని బీజేవైఎం రంగా రెడ్డి జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌గౌడ్ అన్నారు. గురువారం మామిడిపల్లి సీఐఎస్ఎఫ్ పెద్దమ్మ దేవాలయంలో రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్వనాథ్‌గౌడ్ పాల్గొన్నారు. పండుగల ప్రాముఖ్యతను పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో, శ్రీశైలంగౌడ్, యాతం బాబు యాదవ్, విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ తదితరులు

కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటుచేయాలి

రాజేంద్రనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాబుల్‌రెడ్డినగర్, బృందావన్ కాలనీ, సాయిబాబానగర్ నుంచి శివరాంపల్లి రైల్వేస్టేషన్ వరకు వీధి దీపాలు వెలగడం లేదని మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్ అన్నారు. వీధి దీపాలు ఏర్పాటుచేయాలని కోరుతూ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో కార్తీక్ ముదిరాజ్, అనిల్ లింగాయత్, భగవాన్‌దాస్, రాయుడు, రాజ్‌కుమార్, రిషి, సంతోష్, ఆనంద్, జహంగీర్ తదితరులు ఉన్నారు.


మనోజాగృతి సంస్థ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నారాయణమ్మ కళాశాల సిబ్బంది

ఘనంగా మనోజాగృతి సంస్థ ఆవిర్భావ దినోత్సవం

నార్సింగ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య, మనోజాగృతి సంస్థ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ మానసిక నిపుణుడు డాక్టర్ సుశీల్‌కుమార్ పల్లపూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక సమస్యలు, పరిష్కార మార్గాలు, వివిధ మానసిక ఆరోగ్య సంస్థల గురించి వివరించారు. పిల్లలకు ప్రతీ నెల మొదటి శనివారం సుదిశా కౌన్సెలింగ్ సెంటర్‌లో ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణమ్మ కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్మీగూడ రాజీవ్‌గృహకల్పలో దుర్గామాతను దర్శించుకుని పూజలు చేసిన శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్ఎస్ నాయకురాలు లక్ష్మీరాజ్ తదితరులు


హైదర్‌గూడ పోచమ్మ అమ్మవారి దేవాలయంలో పూజ, యజ్ఞం కార్యక్రమాలలో ఇన్‌స్పెక్టర్ కె.నర్సింహ, ఎస్ఐ శ్వేత, ఆలయ నిర్వాహకులు నరేందర్, గంగిడి తదితరులు


రాజేంద్రనగర్ అంబేడ్కర్‌నగర్ బస్తీలో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రంగారెడ్డిజిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు, ఇ.వేణుగోపాల్ తదితరులు


లాల్ దర్వాజ సింహవాహిని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు


టీఎన్‌జీవోస్ కాలనీలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, మంచికంటి సత్యనారాయణ గుప్తా, మాజీ కార్పొరేటర్ టి.ప్రేందాస్‌గౌడ్ తదితరులు

దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు

అబిడ్స్/చార్మినార్/మెహిదీపట్నం జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్, అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం ప్రాంతాల్లో ఆలయాలు, మండపాల వద్ద గురువారం దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, మాజీ కార్పొరేటర్ టి.ప్రేందాస్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ కె.నర్సింహ, ఎస్ఐ బి.శ్వేత, ఆర్యవైశ్య సంఘం నాయకులు అమరవాది లక్ష్మీనారాయణ, మంచికంటి సత్యనారాయణగుప్తా, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.


సుల్తాన్‌షాహి పాత పోస్టాఫీసు వద్ద వైష్ణవీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న జగదాంబ దేవాలయం చైర్మన్ రాకేశ్ తివారీ తదితరులు


దుర్గాదేవి అలంకరణలో ఉప్పుగూడ మహాకాళి అమ్మవారు


జంగమ్మెట్ శ్రీకృష్ణ భక్త సమాజం, ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మహా హారతి ఇస్తున్న మహిళలు


పేట్లబుర్జ్ ఆస్పత్రిలో పూజలో పాల్గొన్న సూపరింటెండెంట్ రజని రెడ్డి తదితరులు


జల్‌పల్లి శ్రీరామ కాలనీ జయభేరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గామాత పూజలో పాల్గొన్న కౌన్సిలర్ పల్లపు శంకర్


బేగంబజార్‌లో మాతా విశాల్ జాగరణ్ కార్యక్రమంలో బీఆర్ఎస్ గోషామహల్ డివిజన్ ఇన్‌చార్జి పురుషోత్తం రావు, మాజీ కార్పొరేటర్ ఎం.రామచంద్రరాజు, వాసు ముదిరాజ్‌ను సత్కరించిన జితేందర్ తదితరులు


హనుమాన్ టేక్డీ జై భవానీ నవరాత్రి ఉత్సవ్‌లో పాల్గొన్న పొట్ట నాగరాజ్, హన్స్‌రాజ్, పృథ్వీరాజ్, దయానంద్, చంద్రమోహన్ యాదవ్, నితేష్‌రెడ్డి, మణికిరణ్


హనుమాన్ టేక్డీలోని ఉమామహేశ్వరి మహాకాళి దేవస్థానంలో నిర్వహించిన హోమం, పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మహేశ్ కుమార్ యాదవ్, కమిటీ ప్రతినిధులు


హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ నిర్వాహకులు చెట్టిగారి నరేందర్ దంపతులు

ఉద్యోగ నోటిఫికేషన్లను ఆపడం రాజ్యాంగ విరుద్ధం

బర్కత్‌పుర అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేసే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లను ఆపడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి. చెన్నయ్య, కో-చైర్మన్ బేర బాలకిషన్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజ నర్సింహ, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ కుట్రలు పన్ని మాలలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల మహానాడు ప్రతినిధులు బత్తుల రాంప్రసాద్, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మంచాల లింగస్వామి, జంగా శ్రీనివాస్, కరణం కిషన్, జి.వినోద్‌కుమార్, తారక అనిల్, మన్నె శ్రీరంగంతో కలిసి ఆయన మాట్లాడారు.


అభివాదం చేస్తున్న జి.చెన్నయ్య, బేర బాలకిషన్, బత్తుల రాంప్రసాద్ తదితరులు

2011 జనాభా లెక్కల ఆధారంగా వర్గీకరణ అమలు ఏ విధంగా చేస్తారని, దీని వల్ల మాలలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ప్రస్తుత ఎస్సీ జనాభాకు అనుగుణంగా వివరాలు సేకరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రంలో అవసరం లేదని, ఎక్కువగా లబ్ధి పొందింది మాదిగ కులస్థులేనని ఆరోపించారు. ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని మంత్రుల ఉపసంఘాన్ని తక్షణమే రద్దు చేయాలని, ఎస్సీ వర్గీకరణ విషయంలో నోరువిప్పని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఎస్సీ డేటాను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

యూజీసీ పేస్కేల్ అమలు చేయాలి

- **చైర్మన్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకుల వినతి**

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న తమకు కూడా యూజీసీ పేస్కేల్ అమలు చేయాలని, సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలువురు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గురువారం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి వచ్చిన యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి సమక్షంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు మాట్లాడుతూ.. పదిహేనేళ్లుగా పనిచేస్తున్నామని, యూజీసీ నిబంధనల ప్రకారం తమకు అన్ని అర్హతలు ఉన్నాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న మ్యాగజైన్స్‌లో తమ వ్యాసాలు కూడా ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ యూజీసీ పేస్కేల్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వినతికి జగదీశ్‌కుమార్ సానుకూలంగా స్పందించారని, యూజీసీ నుంచి ఎటువంటి ఆటంకం లేకుండా స్కేల్స్ వర్తించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. యూజీసీ చైర్మన్‌ను కలిసిన వారిలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు ఉపేందర్, సనత్, శేఖర్ రెడ్డి, యాదయ్య, కృష్ణ, కృష్ణవేణి, అనురాధ, రవికిరణ్ తదితరులున్నారు.


యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్‌కు లింబాద్రి సమక్షంలో వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

మనీ లాండరింగ్ కేసుల పేరుతో భయపెట్టి..

- **వృద్ధుడి వద్ద రూ. 8.30 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మీ ఖాతా నుంచి విదేశాలకు డబ్బులు వెళ్లాయని, మీపై మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని భయపెట్టిన సైబర్ నేరగాళ్లు వృద్ధుడి వద్ద రూ. 8.30 లక్షలు కాజేశారు. రిటైర్డ్ ఉద్యోగి(85) సెల్‌ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు 8284880588 నంబర్ నుంచి ఫోన్ చేశారు. మీ పేరున ముంబై బ్యాంకులో ఉన్న ఖాతా నుంచి విదేశాలకు పెద్ద మొత్తంలో డబ్బు వెళ్లిందని చెప్పారు. మీపై మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయని భయపెట్టారు. ఈ కేసుల్లో మిమ్మల్ని డిజిటల్ అరెస్ట్ చేశామని, గది నుంచి బయటకు వెళ్లొద్దని ఆంక్షలు విధించారు. స్కైప్ యాప్ డౌన్‌లోడ్ చేయించి వీడియో కాల్‌లో అరెస్ట్ వారెంట్ చూపించారు. ముంబై క్రైం బ్రాంచ్ అధికారులు ఏక్షణంలోనైనా అరెస్ట్ చేస్తారని బెదిరించారు. అరెస్ట్‌ను ఆపాలంటే డబ్బులు చెల్లించాలన్నారు.

రెండుసార్లు వేర్వేరు ఖాతాల్లో రూ. 8.30 లక్షలు జమచేయించుకున్నారు. వారు మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రాజేంద్రనగర్‌లో బతుకమ్మతో మహిళలు


బతుకమ్మ వేడుకల్లో లయన్స్ క్లబ్ నిర్వాహకులు


రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం మైదానంలో బతుకమ్మ వేడుకల సందర్భంగా దాండియా ఆడుతున్న బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ తదితరులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో
బతుకమ్మ సంబురాలు

రవీంద్రభారతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో బాంగియా సాంస్కృతిక సంస్థ, లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320బి సంయుక్తాధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను గురువారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు స్థానిక మహిళలు బతుకమ్మ ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆడి పాడారు. కార్యక్రమంలో బాంగియా సంస్థ అధినేత దీపభట్టాచార్య, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి లయన్ డా.సుబ్రహ్మణ్యం, డిస్ట్రిక్ గవర్నర్లు లయన్ సాయిరాం, మధుమిత భట్టాచార్య, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా లయన్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణలో మాత్రమే జరుపుకునే పండుగ బతుకమ్మ అని అన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగ అని అభివర్ణించారు. కుల, మతాలకు అతీతంగా జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zKpch66లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ప్రాణం తీసిన ఇనుప సీకులు

- **పత్తికుంట చెరువులో దిగి వ్యక్తి మృతి**

రాజేంద్రనగర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల నుంచి కనిపించకుండాపోయిన వ్యక్తి మృతి చెందాడు. రాజేంద్రనగర్ హనుమాన్ బస్తీకి చెందిన నిరంజన్(45)ఈనెల 7వ తేదీ నుంచి కనిపించడంలేదు. పతికుంట చెరువులో గురువారం మృతదేహం లభించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నిరంజన్ (ఫైల్)

15 రోజుల్లో ముగ్గురు..

పత్తికుంట చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహిస్తారు. సెప్టెంబరు 25వ తేదీన ఎస్. అంజనేయులు(34) ఇనుప సీకులను తీయడానికి చెరువులో దిగి నీటిలో మునిగి మృతి చెందాడు. 11 రోజుల క్రితం నాగరాజు అనే యువకుడు ఇనుప సీకుల కోసం చెరువులో దిగి గల్లంతయ్యాడు. మూడు రోజుల క్రితం పత్తికుంట బ్రిడ్జి వద్ద అతడి మృతదేహం లభించింది. చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనం అనంతరం ఇనుప సీకులను తీయడానికి చెరువులో దిగి మృతిచెందుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

చెరువులో ఇనుప సీకులను తొలగించాలి

పత్తికుంటలో వినాయక విగ్రహాల నిమజ్జనం అనంతరం జీహెచ్ఎంసీ అధికారులు ఇనుప సీకులను పూర్తిస్థాయిలో తొలగించడం లేదు. దీంతో సీకుల కోసం చెరువులో దిగిన వారు ప్రాణాలు కోల్పోతున్నారు. చెరువులో ఇనుప సీకుల తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

- వై.శ్రీధర్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్


బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

నార్సింగ్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలికను నార్సింగ్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. అల్కాపూర్ కాలనీ మహాత్మాగాంధీ పార్కులో తనూజ ఆడుకుంటూ గురువారం తప్పిపోయింది. తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు ప్రారంభించారు. బాలిక నెక్నాంపూర్‌లో చింతచెట్టు వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడి వెళ్లి బాలికతో తల్లిదండ్రులతో వీడియో కాల్ మాట్లాడించి బాలికను వారికి అప్పగించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న నిఫ్డ్ డైరెక్టర్ రాము యాదవ్

బర్కత్‌పుర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైనింగ్‌లో వివిధ కోర్సులకు అర్హులైన వారు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ (నిఫ్డ్) డైరెక్టర్ రాము యాదవ్, చైర్మన్ కన్నెబోయిన గీత తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్ ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైనింగ్, వృత్తివిద్య డిప్లొమా, డిగ్రీ, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, పీజీ డిప్లొమా తదితర కోర్సులతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు మార్కెట్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చని, పూర్తి వివరాలకు 9030610033, 9030610055 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అధిక ఆలోచనలు, పనిఒత్తిడితో మానసిక సమస్యలు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సుజోయ్‌పాల్

ఎర్రగడ్డ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య గణాంకాల ప్రకారం దేశంలో లక్ష మందికి ఒక మానసిక వైద్యుడు మాత్రమే ఉన్నాడని, ఈ సంఖ్య పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ అభిప్రాయపడ్డారు. గురువారం ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి న్యాయమూర్తి హాజరై మాట్లాడారు. మితిమీరిన ఆలోచనలు, ఒత్తిడి వల్ల శరీరంలో అనేక ఇబ్బందుల తోపాటు మానసిక వ్యాధులకు దారితీస్తున్నాయని చెప్పారు. జిల్లా సెషన్స్ జడ్జి పంచాక్షరి మాట్లాడుతూ ప్రపంచస్థాయిలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వడమే ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత, ఏసీపీ వెంకటరమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధారాణి, ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్ పద్మజ, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో విజయం సాధించిన వైద్యులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రూ.229 కోట్ల భారీ మోసం

- అత్యధిక లాభాలంటూ డీకేజెడ్ టెక్నాలజీస్ బురిడీ
- 17,500 మందిని దగా చేసిన కేటుగాళ్లు
- యూట్యూబ్ వీడియోలకు ఆకర్షితులై.. కోట్లు పెట్టుబడులు పెట్టిన బాధితులు
- డైరెక్టర్, ప్రొప్రయిటర్ అరెస్టు



హైదరాబాద్‌సిటీ,అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): 'లక్ష పెట్టుబడి పెడితే బేసిక్ స్కీమ్ కింద 15 శాతం ప్రాఫిట్‌తో మూడు నెలల్లో రూ. 1.15 లక్షలు, ఆరు నెలల్లో గోల్డెన్ స్కీమ్ కింద రూ. 1.25 లక్షలు, 12 నెలలకు ప్లాటినం స్కీమ్ కింద 60 శాతం ప్రాఫిట్‌తో రూ. 1.60 లక్షలు, 24 నెలలకు ఆర్బిట్ స్కీమ్ కింద 100 శాతం ప్రాఫిట్‌తో రెట్టింపు డబ్బులు అంటే 2 లక్షలు అందిస్తాం' అంటూ బురిడీ కొట్టించారు డీకేజెడ్ టెక్నాలజీస్ నిర్వాహకులు. సుమారు 17,500 మందిని మోసం చేసి రూ.229 కోట్లు కొల్లగొట్టి భారీ ఆర్థిక మోసానికి పాల్పడిన కేటుగాళ్ల ఆటకట్టించారు సిటీ సీసీఎస్ పోలీసులు. సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వక్ రహీల్ డైరెక్టర్‌గా, ఆయన భార్య సయిదా అయేశానాజ్ ప్రొప్రయిటర్‌గా మాదాపూర్‌లో డీకేజెడ్ టెక్నాలజీస్/డికాజో సొల్యూషన్స్ ప్రై. లిమిటెడ్ పేరుతో సంస్థను ప్రారంభించారు. మాదాపూర్‌లో డికాజో, చాదర్‌ఘాట్‌లో అర్లీ ఫ్రెష్ స్టోర్ ఉన్నాయని, హెడ్‌సెట్స్, నెక్‌బ్యాండ్ కంపెనీ బోల్ట్, అమెజాన్‌తో ఒప్పందాలు చేసుకున్నామని నమ్మించారు. బిటుబి (బిజినెస్ టు బిజినెస్), బీ టు సి (బిజినెస్ టు కస్టమర్) వ్యాపారానికి అవకాశం ఉందన్నారు. అమెజాన్ నుంచి రోజుకు 4000 ఆర్డర్స్ వస్తాయని ప్రచారం చేసుకున్నారు. ప్రత్యేక ఏజెంట్లను నియమించుకోవడంతో పాటు, సోషల్‌మీడియా, యూట్యూబ్‌లలో భారీగా ప్రచారం చేశారు. తమ సంస్థలో పెట్టుబడులు పెడితే ప్రారంభంలోనే 8 నుంచి 12 శాతం ప్రాఫిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. యూట్యూబ్‌లో ప్రచార వీడియోలకు ఆకర్షితులైన కొందరు మాదాపూర్‌లోని కార్యాలయానికి వచ్చి విచారించేవారు. సంస్థ మేనేజర్లు మహ్మద్ ఇక్బాల్, సయ్యద్ ఉమర్ అహ్మద్, నజీర్, బిలాల్ పెట్టుబడుల గురించి, ప్రాఫిట్స్ గురించి, సంస్థ ప్రవేశపెట్టిన బేసిక్, గోల్డెన్, ప్లాటినం, ఆర్బిట్ స్కీముల గురించి వివరించేవారు. వాటికి సంబంధించిన బ్రోచర్లను ఇచ్చేవారు. రూ.5000 నుంచి పెట్టుబడులు పెట్టవచ్చని సూచించారు. వారి మాటలను నమ్మిన కస్టమర్లు రూ. కోట్లలో పెట్టుబడులు పెట్టారు.

వెలుగులోకి వచ్చిందిలా..

గుడిమల్కాపూర్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ జైష్ ఈ ఏడాది జనవరిలో డీకేజెడ్ టెక్నాలజీస్/డికాజో సొల్యూషన్స్‌కు సంబంధించిన ఇన్వెస్టిమెంట్ ప్లాన్స్ వీడియోను యూట్యూబ్‌లో చూశాడు. ఆ స్కీమ్‌లకు ఆకర్షితుడైన జైష్.. మాదాపూర్‌లోని సంస్థ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడి వారితో మాట్లాడడంతో పాటు కార్యాలయం హంగూ ఆర్భాటాన్ని, కార్పొరేట్ హంగామాను చూసి ముగ్ధుడై కొంత పెట్టుబడి పెట్టాడు. రిటర్న్స్ రావడంతో కొద్దినెలలు గడిచిన తర్వాత మరోసారి కార్యాలయానికి వెళ్లి తన వాటాగా రూ.2.74 కోట్లు పెట్టుబడులు పెట్టారు. సంస్థ నుంచి రిటర్న్స్ రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సీసీఎస్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సీసీఎస్ పోలీసులు కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 564 ఒరిజినల్ ప్రొక్యూర్‌మెంట్ గ్యారెంటీ అగ్రిమెంట్ బాండ్లు, డీకేజెడ్ టెక్నాలజీస్ లోగోతో కూడిన 5 బండిళ్ల లెటర్ హెడ్స్, వివిధ ఖాతాదారుల పేరుతో ఉన్న చెక్‌బుక్స్, 13 ల్యాప్‌టాప్‌లు, రూ.1.70కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఇచ్చిన వాంగ్మూలం, డీకేజెడ్ టెక్నాలజీస్ రికార్డుల పరిశీలన అనంతరం మొత్తం 17,500 మంది నుంచి అక్రమంగా రూ.229 కోట్ల పెట్టుబడులు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్థిక మోసంతో పాటు, తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేశారు. సీపీ సీవీ ఆనంద్ ఆదేశాలతో సీసీఎస్ డీసీపీ శ్వేత పర్యవేక్షణలో ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగింది. టెక్నికల్ ఎవిడెన్స్‌తో డైరెక్టర్, ప్రొప్రయిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతర మేనేజర్స్, ఏజెంట్లు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారినీ అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

ఇంటర్ డిప్యూటేషన్‌పై ఆమ్రపాలి ఇక్కడే!

- ఇరు రాష్ట్రాలు అంగీకరిస్తే కొనసాగింపు
- ఈనెల 16లోపు రిపోర్టు చేయాలని కేంద్రం ఆదేశం



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇక్కడే కొనసాగుతారా? లేదా? అన్న చర్చ అధికార, ఉద్యోగవర్గాల్లో జోరుగా సాగుతోంది. 2010 ఏపీ కేడర్‌కు చెందిన ఆమ్రపాలి తెలంగాణ నివాసంగా పరిగణించి ఇక్కడి కేడర్‌గా గుర్తించాలని కోరగా, ఖండేకర్ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఆమె విజ్ఞప్తిని తాజాగా కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. ఈనెల 16లోపు ఏపీలో రిపోర్టు చేయాలని కూడా ఆదేశాలిచ్చింది. కేంద్ర ఆదేశాల నేపథ్యంలో ఆమ్రపాలి ఏపీకి వెళ్లేందుకు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. అయితే, చివరి అవకాశంగా ఇంటర్ డిప్యూటేషన్‌పై తెలంగాణలోనూ నిర్ణీత సమయం పాటు పనిచేసే అవకాశాలున్నాయి. ఇందుకు ఇరురాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం అంగీకరించుకోవాల్సి ఉంటుంది.

పర్మినెంట్ అడ్రస్ విశాఖగా పేర్కొనడంతో..

ఆమ్రపాలి తన యూపీఎస్సీ అప్లికేషన్‌లో తన పర్మినెంట్ అడ్రసుగా విశాఖపట్నంగా పేర్కొనడంతో ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించారు. అయితే తెలంగాణ స్థానికురాలిగా గుర్తించి ఇక్కడి కేడర్‌కు పంపాలని ఆమ్రపాలి విజ్ఞప్తి చేశారు. ఆమె చేసిన పలు విజ్ఞప్తులను పరిశీలించి పలు అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా తప్పుకొని ఏపీకి వెళ్తారా? లేదా ఇంటర్ డిప్యూటేషన్‌పై కొనసాగే అవకాశాన్ని వినియోగించుకుంటారా? అన్న చర్చ మొదలైంది.

ట్యూషన్ ఫీజు సగానికి తగ్గింపు

- స్పాన్సర్డ్ కేటగిరీలో పీజీ కోర్సులకు 50శాతం మాఫీ
- జేఎన్టీయూ నిర్ణయం.. ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్పాన్సర్డ్ కేటగిరీ పీజీ సీట్లలో అడ్మిషన్లు పొందాలనుకునే వారికి జేఎన్‌టీయూ తీపికబురు చెప్పింది. ఈ కేటగిరీలో గతేడాది వరకు ట్యూషన్ ఫీజు సెమిస్టర్‌కు రూ.70,000 ఉండగా, ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందే వారికి రూ.35వేలకు తగ్గిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ విద్యాసంవత్సరానికిగాను స్పాన్సర్డ్ కేటగిరీలో ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో మొత్తం 186 సీట్ల భర్తీకి జేఎన్టీయూ అడ్మిషన్ విభాగం అధికారులు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీజీ సీట్లలో ప్రవేశం కల్పిస్తారు. గేట్/జీపాట్, పీజీఈసెట్, గ్రాడ్యుయేషన్‌లో వచ్చిన మార్కులతో మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు పొందవచ్చని, ఆసక్తి ఉన్నవారు తాము పనిచేస్తున్న సంస్థ నుంచి స్పాన్సర్డ్ లెటర్‌ను దరఖాస్తుతోపాటు సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రవేశాలు కోరుకునే అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 16 నుంచి 19వరకు జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియకు నేరుగా హాజరుకావచ్చు. 16న ఎలక్ట్రికల్, మెకానికల్, ఎనర్జీ సిస్టమ్స్, బయోటెక్నాలజీ, 17న కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్, 18న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎంఫార్మసీ, నానో టెక్నాలజీ, 19న సివిల్, వాటర్ రిసోర్సెస్, స్పేషియల్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ విభాగాలకు చెందిన స్పెషలైజేషన్ కోర్సుల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల అభ్యర్థులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారికి అమలు చేస్తున్న 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం.

సెంట్రల్ మిచిగాన్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

అమెరికాలో ప్రఖ్యాతిగాంచిన సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీ(సీఎంయూ)తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కారణంగా జేఎన్‌టీయూ ద్వారా అభ్యర్థులు తమ ఎంబీఏ పూర్తి చేయొచ్చని అధికారులు తెలిపారు. సీఎంయూ ఎంబీఏ కోర్సులో ప్రవేశాల నిమిత్తం జేఎన్‌టీయూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ కోర్సులో మొత్తం 20 సీట్లు ఉండగా, ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఏడాది (2సెమిస్టర్లు)పాటు జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో, మరో ఏడాది (2సెమిస్టర్లు) అమెరికాలోని సెంట్రల్ మిచిగాన్ యూనివర్సిటీలో చదువుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఈనెల 30లోపు జేఎన్‌టీయూ వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. రాతపరీక్షలో అర్హత పొందిన అనంతరం మెరిట్ ప్రాతిపదికన ఎంబీఏలో ప్రవేశాలు కల్పిస్తారు.

సొంతూరు పోదాం పండుగ చేద్దాం







విజయదశమి సమీపిస్తుండడంతో నగరం నుంచి స్వగ్రామాలకు భారీగా తరలివెళ్తున్నారు. దీంతో మహాత్మా గాంధీ బస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్, జూబ్లీ బస్టాండ్లు రద్దీగా మారాయి. రెగ్యులర్ బస్సులతోపాటు ప్రత్యేక బస్సులన్నీ ప్రయాణికులతో నిండుగా వెళ్తున్నాయి.

ఘనంగా ఆయుధ పూజ



దసరా నవరాత్రుల్లో భాగంగా గురువారం అంబర్‌పేటలోని రాచకొండ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధాలకు శాస్త్రోక్తంగా పూజలు చేస్తున్న పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు

బ్యాక్‌డోర్ పేరుతో మరో వంచన

- ఐటీ కారిడార్‌లో బోర్డు తిప్పేసిన మరో సంస్థ
- 500 మంది నుంచి డబ్బులు వసూలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బ్యాక్‌డోర్ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన మరో ఐటీ సంస్థ బోర్డు తిప్పేసింది. మాదాపూర్ కావూరిహిల్స్‌లోని వీవీ చాంబర్స్ నాలుగో అంతస్తులో 'సినర్జీ యూనివర్సల్' పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. బ్యాక్‌డోర్‌లో ఉద్యోగాలంటూ నిరుద్యోగులను నమ్మించిన యాజమాన్యం సుమారు 500 మంది నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేసింది. డబ్బులు కట్టిన వారికి ఆఫర్ లెటర్లు ఇచ్చి, వర్క్‌ఫ్రం హోం అంటూ ఇంటికి పంపారు. ఆఫర్ లెటర్ ఇచ్చినా జీతాలు ఇవ్వకుండా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కొద్దిరోజులుగా కంపెనీ ప్రతినిధులు కార్యాలయానికి రాకపోవడంతో బాధితులు మోసపోయామని గ్రహించి మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. మోసం రూ.15 కోట్ల మేర ఉండడంతో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

'అలయ్-బలయ్'కి రండి



దసరా సందర్భంగా ఈనెల 13న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 'అలయ్-బలయ్' కార్యక్రమానికి విచ్చేయాలని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న బండారు విజయలక్ష్మి



అభివాదం చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఆర్.కృష్ణయ్య తదితరులు

సమీకృత గురుకులాలు ఏకపక్ష నిర్ణయం

- మిగతా పాఠశాలల పరిస్థితి ఏమిటి ?
- చర్చా కార్యక్రమంలో పలువురు వక్తలు

పంజాగుట్ట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల స్థానంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తామని ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల'పై సమగ్ర చర్చా కార్యక్రమం జరిగింది. ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలకు సంబంధించి అఖిలపక్షం ఏర్పాటు చేయాలన్నది మంచి ఆలోచన అని, ఇందుకోసం తనవంతు ప్రయత్నం చేస్తానని నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి అన్నారు. సీఎం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, రేవంత్‌రెడ్డి వల్ల గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు రాలేదని..తమ పోరాటాల ఫలితంగా అప్పటి ముఖ్యమంత్రులు ఏర్పాటు చేశారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గుర్తుచేశారు. సమీకృత గురుకులాలను అసెంబ్లీ నియోజకవర్గానికొకటి మంజూరు చేస్తే మిగతా పాఠశాలల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అసలు సమీకృత గురుకులాలు ఎందుకని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి విజయ్ ఆర్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నక్సల్స్ పేరుతో రైల్వే కాంట్రాక్టర్‌కు బెదిరింపులు

నలుగురి అరెస్టు, ఆరు ఫోన్లు స్వాధీనం



పోలీసులకు చిక్కిన నకిలీ నక్సలైట్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న ఆశతో నక్సలైట్లమంటూ రైల్వే కాంట్రాక్టర్‌ను బెదిరించిన నలుగురు వ్యక్తులను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ప్రసాద్ అలియాస్ ప్రదీప్ రెండేళ్లపాటు రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేశాడు. ఆ తర్వాత గుప్తనిధుల కోసం వేట ప్రారంభించి పలు ప్రాంతాల్లో తవ్వకాలు జరిపాడు. ఆ సమయంలో అతనికి మియాపూర్‌కు చెందిన రత్‌లావత్ రవినాయక్, షాబాద్‌కు చెందిన సత్తయ్య, కమ్మరి శేషప్ప అలియాస్ రాజుతో పరిచయం ఏర్పడింది. గుప్తనిధుల కోసం ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులు అధికమవ్వడంతో ఏదోవిధంగా రూ.కోట్లలో డబ్బులు కొల్లగొట్టాలని పథకం వేశాడు. గతంలో తాను పనిచేసిన రైల్వే కాంట్రాక్టర్‌కు నక్సలైట్లమని ఫోన్ చేసి రూ.5 కోట్లు ఇవ్వాలని, లేకుంటే అంతం చేస్తామని బెదిరించాడు. అనుమానం వచ్చిన కాంట్రాక్టర్ ఉస్మానియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పక్కా నిఘాతో మాటువేసి నలుగురు నకిలీ నక్సలైట్లను అరెస్టు చేశారు.

బీజేపీ కార్యాలయానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గురువారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి వచ్చిన మల్లారెడ్డి, మనుమరాలు వివాహ ఆహ్వానపత్రికను కిషన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ తనకు రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అని అన్నారు. అప్పట్లో టీడీపీ-బీజేపీ పొత్తు వల్ల తాను మల్కాజిగిరి ఎంపీ అయ్యానని గుర్తుచేశారు. కిషన్‌రెడ్డి తనకు మంచిమిత్రుడని మల్లారెడ్డి పేర్కొన్నారు.

జైతీర్థ్ ఆర్ జోషికి విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు



అవార్డు అందుకున్న డాక్టర్ జైతీర్థ్ ఆర్ జోషి

అల్వాల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డీఆర్‌డీఎల్) అత్యుత్తమ శాస్త్రవేత్త, ప్రోగ్రామ్ డైరెక్టర్ జైతీర్థ్ ఆర్ జోషికి వరంగల్ నిట్ ప్రతిష్టాత్మక విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డును (డీఏఏ-2024)ను అందించి ఘనంగా సత్కరించింది. గురువారం వరంగల్ నిట్ (ఎన్ఐటీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు.



జీహెచ్ఎంసీ పథకాలను పరిశీలించిన ఏపీ మున్సిపల్ అధికారుల బృందం

జీహెచ్ఎంసీ పథకాల అధ్యయనానికి ఏపీ అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అమలు చేస్తున్న పథకాలపై అధ్యయనం కోసం ఏపీ నుంచి వచ్చిన మున్సిపల్ అధికారులు గురువారం ఆయా విధానాలు, అభివృద్ధి పథకాలను సమీక్షించారు. ప్రధానంగా ట్యాక్స్, ఫైనాన్స్, కస్టమర్ రిలేషన్ మేనేజ్‌మెంట్ పోర్టల్ (సీఆర్ఎంపీ), సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి కీలక విభాగాల్లో జీహెచ్ఎంసీ తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు.

● కొనుగోళ్ల సందడి



దసరా సమీపిస్తుండడంతో మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. పూలు, గుమ్మడికాయలు, సామగ్రి అమ్మకాలతో గురువారం మోండా మార్కెట్ సందడిగా కనిపించింది.